సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



ధాన్యం అమ్ముకున్నారు!
సీఎంఆర్ కోసం సివిల్ సప్లయ్ శాఖ ఇచ్చిన రూ.515 కోట్లు విలువ చేసే ధాన్యాన్ని మిల్లర్లు అమ్ముకున్నారు. - 8లో



ఎమ్మెల్సీకి మాతృవియోగం
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాతృమూర్తి భాగ్యమ్మ(82) గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. - 8లో



డెంగీతో విద్యార్థి మృతి
శాలిగౌరారం మండలం మనిమద్దెకు చెందిన టెన్త్ విద్యార్థి ఆస్పత్రిలో డెంగీ చికిత్స పొందుతూ మృతిచెందాడు. - 8లో

న్యూస్‌రీల్

ఫ్లోరోసిస్ నుంచి విముక్తి కల్పించాలి

- ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కంచుకట్ల సుభాష్


కంచుకట్ల సుభాష్

మర్రిగూడ: ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేసి డిండి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించి జిల్లాలో ఫ్లోరోసిస్‌కు శాశ్వత పరిష్కారం చూపాలని ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కంచుకట్ల సుభాష్ అన్నారు. గురువారం ఆయన మర్రిగూడ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలకు కృష్ణా జలాలు అందించాలన్నారు. ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులను గుర్తించి సదరం సర్టిఫికెట్ అందించాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని కోరారు. 30శాతం వైకల్యం ఉన్న ఫ్లోరోసిస్ బాధితులకు నెలకు రూ.15వేల పింఛన్లు అందించడంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. శివన్నగూడెం, కిష్టరాయనపల్లి ప్రాజెక్టుల భూనిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కబడ్డీ బాలుర జూనియర్ జట్టు ఎంపిక

హాలియా: అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కబడ్డీ జిల్లా బాలుర జూనియర్ జట్టును ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.భూలోకరావు, జి.కర్తయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కెప్టెన్‌గా పి.భరత్ (గర్నెకుంట), సీహెచ్.గణేష్ (మిర్యాలగూడ), ఎం.గిరి (గుడిపల్లి), పి.రాజు (పాల్తీతండా), ఎస్.శ్రీపాదం (పెద్దగట్టు), డి.మధు (అనుముల), జి.వేణు (ఇబ్రహీంపేట), కె.రాకేష్ (మధారిగూడెం), సీహెచ్.హన్మంతు (వెల్మగూడెం), ఆర్.శివ (కోదండపురం), కె.అనిల్ (వెల్మగూడెం), ఎన్.వెంకటేష్ (తుంగతుర్తి), ఎస్‌కె.వహీద్ (తడకమళ్ల) ఎన్నికయ్యారని తెలిపారు. కోచ్‌గా కె.సైదులు (చిల్కాపురం), మేనేజర్‌గా పి.సత్యనారాయణ వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జనగాంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటుందని తెలిపారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

సూర్యాపేటటౌన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ బిల్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్ రుణాలు, పార్ట్ ఫైనల్స్, పెన్షనర్ల రిటైర్మెంట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈనెల 28 నుంచి 30 వరకు నల్లగొండలో జరిగే యూటీఎఫ్ ఆరవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాకయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అరుణ భారతి, జిల్లా కోశాధికారి వెంకటయ్య, జిల్లా కార్యదర్శులు నాగేశ్వరరావు, ఆడం, రమేష్, లాలు, పాండురంగాచారి, రవీందర్, సాంబయ్య, శ్రీనివాస చారి పాల్గొన్నారు.

నృసింహుడికి లక్ష పుష్పార్చన


పుష్పార్చన చేస్తున్న ప్రధానార్చకుడు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గురువారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్ష పుష్పార్చన పూజను ఆగమశాస్త్రానుసారంగా వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభూలకు అర్చకులు పంచామృతాలతో నిజాభిషేకం చేసి, తులసి దళాలతో సహస్రనామార్చనలు నిర్వహించారు. అనంతరం ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి బంగారు సింహాసనంపై అధిష్ఠింపజేసి వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఇక ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదాదేవికి అర్చకులు ప్రత్యేక పాశురం పఠించారు.

సమ్మె ఉధృతం..

నేటి నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు వంద శాతం సమ్మె బాట



నల్లగొండ కలెక్టరేట్ ఎదుట సమ్మెలో భాగంగా అరటి పండ్లు అమ్ముతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

- 17 రోజులుగా దీక్షలు చేస్తున్నా స్పందించని ప్రభుత్వం
- ఉన్నతాధికారుల ఆదేశంతో జిల్లా యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- కేజీబీవీల్లో ఇన్‌చార్జి ఎస్ఓలుగా ఉపాధ్యాయుల నియామకం

నల్లగొండ: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మెను ఉధృతం చేసేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల సమయంలో తమను రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో టీచింగ్, నాన్ టీచింగ్ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు నల్లగొండ కలెక్టరేట్ ఎదుట పదిహేడు రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిరోజూ ఒకరిద్దరు టీచర్లను పాఠశాలల్లో ఉంచి మిగిలిన టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. ఇప్పటికే డిప్యూటీ సీఎంతోపాటు పలువురు మంత్రులకు కూడా తమ సమస్యలను విన్నవించారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,111 మంది ఉద్యోగులు శుక్రవారం నుంచి నూరు శాతం సమ్మెబాట పట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

17 రోజులుగా సమ్మెలోనే..

తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు గత 17 రోజుల నుంచి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమ్మె నిర్వహిస్తున్నారు. రోజుకో రీతిలో ప్రభుత్వానికి తమ నిరసన తెలుపుతున్నారు. తాజాగా గురువారం అరటి పండ్లు అమ్ముతూ కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. వీరి సమ్మెతో జిల్లాలోని 27 కేజీబీవీల్లో విద్యాబోధన నిలిచిపోయింది. దాదాపు ఐదారు వేల మంది విద్యార్థినులకు పాఠాలు చెప్పేవారు లేక పాఠశాలలకు వచ్చి ఆటలాడుకుని వెళ్తున్న పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో విద్యా శాఖ

సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం నుంచి వంద శాతం సమ్మెలో పాల్గొంటామని ప్రకటించడంతో విద్యార్థుల పర్యవేక్షణతోపాటు పాఠాలు బోధించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈఓ భిక్షపతి ఒక్కో కేజీబీవీకి ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులను ఇన్‌చార్జి ఎస్ఓగా నియమించారు. ఈ నేపథ్యంలో కొందరు గురువారమే విధులకు హాజరుకాగా శుక్రవారం నుంచి మిగతావారు హాజరు కానున్నట్లు తెలుస్తోంది.

ఇక్కడ ఆడుకుంటున్నది తిప్పర్తి మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు. సమగ్ర శిక్ష ఉద్యోగులు 17 రోజులుగా చేస్తున్న సమ్మె కారణంగా పాఠాలు చెప్పేవారు, పర్యవేక్షించేవారు లేక గురువారం తమ పాఠశాలలో ఇలా ఆడుకుంటూ కనిపించారు. ఈ పాఠశాలలో రోజూ ఇదే పరిస్థితి నెలకొంది.



స్పందించకపోవడం బాధాకరం



17 రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులంతా సమ్మెలో పాల్గొంటుంటే ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరంగా ఉంది. ఇచ్చిన హామీలు నెరవేర్చాలనే డిమాండ్ చేస్తున్నాం తప్పితే కొత్తగా ఏమి కోరడం లేదు. శుక్రవారం నుంచి నూటికి నూరు శాతం ఉద్యోగులం సమ్మెలోకి వెళుతున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి.
–కృష్ణ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

దగ్గర పడుతున్న పరీక్షలు.. ఆందోళనలో విద్యార్థినులు

మార్చి 5 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. అయితే కేజీబీవీ టీచర్లు సమ్మె చేస్తుండడం.. పాఠశాలల్లో సిలబస్ పూర్తి కాకపోవడంతో తాము పరీక్షలు ఎలా రాస్తామని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. టీచర్ల సమ్మెను విరమించకపోతే తాము పదో తరగతి ఉత్తీర్ణత కావడం కష్టమేనని బాలికలు అంటున్నారు.

● పోరుగడ్డపై మన్మోహన్ సింగ్ జ్ఞాపకాలు


ఎన్నికల ప్రచారంలో భాగంగా 2014 ఏప్రిల్ 14న భువనగిరి మండలం రాయగిరిలో నిర్వహించిన బహిరంగ సభ వేదికపై నుంచి అభివాదం చేస్తున్న అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో కోమటిరెడ్డి బ్రదర్స్ –భువనగిరి టౌన్

కాంగ్రెస్ జోడో ర్యాలీకి తరలిరండి

- 28న నల్లగొండలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం, బహిరంగ సభ
- పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 28న నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్న జోడో ర్యాలీ, బహిరంగ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నీలగిరి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ జోడో ర్యాలీ మధ్యాహ్నం 1 గంటకు గడియారం సెంటర్ నుంచి ప్రారంభమై ఎన్జీ కాలేజి నుంచి శివాజీనగర్, రామగిరి మీదుగా తిరిగి గడియారం సెంటర్‌కు చేరుకుంటుందన్నారు. అనంతరం గడియారం సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. మంత్రి కోమటిరెడ్డి బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది.. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీ యేనని పేర్కొన్నారు. మతతత్వ బీజేపీ ప్రజలను రెచ్చగొడుతోందని ఆరోపించారు. టీఆర్ఎస్ మోసాలను బహిరంగ సభలో ప్రజలకు వివరిస్తామన్నారు. అనంతరం కాంగ్రెస్ జోడో ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నాయకులు వంగూరి లక్ష్మయ్య, పాశం సంపత్‌రెడ్డి, అనూప్‌రెడ్డి, మామిడి కార్తిక్, గాలి నాగరాజు, జూలకంటి సైదిరెడ్డి, సతీష్, జహంగీర్, అబ్బాస్ పాల్గొన్నారు.


కాంగ్రెస్ జోడో ర్యాలీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఎనిమిది లెప్రసీ కేసులు

ఇటీవల సర్వేలో 151 మంది అనుమానితుల గుర్తింపు

- వారందరికీ పరీక్షలు చేసిన వైద్య ఆరోగ్య శాఖ
- జిల్లాలో 102కు చేరిన కుష్టు బాధితులు

నల్లగొండ టౌన్: జిల్లా వ్యాప్తంగా ఎనిమిది కుష్టువ్యాధి (లెప్రసీ) కేసులు నమోదయ్యాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ నెల 2 నుంచి 15వ తేదీ వరకు వైద్య ఆరోగ్యశాఖ లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) సర్వే నిర్వహించింది. జిల్లా వ్యాప్తంగా 1,466 మంది సిబ్బంది మొత్తం 1,49,179 ఇళ్లను సందర్శించి 5,47,892 మందిని పరీక్షించారు. ప్రతిఒక్కరి శరీరంపై ఉన్న తెల్ల, నల్ల, గోధుమ రంగు మచ్చలు, స్పర్శలు లేని మచ్చలను పరిశీలించారు. అందులో 151 మందికి లెప్రసీ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వారందరికీ పూర్తి స్థాయిలో లెప్రసీ పరీక్షలను నిర్వహించగా ఎనిమిది మందికి కుష్టువ్యాధి ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ నిర్ధారించింది.

బాధితులకు చికిత్స ఇలా..

జిల్లాలో ఇప్పటికే 94 మంది కుష్టువ్యాధి బాధితులు బహుళ ఔషధ పద్ధతిన (మల్టీ డ్రగ్ థెరపీ–ఎండీటీ) చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం గుర్తించిన 8 మందితో కలిపి జిల్లాలో మొత్తం 102 మంది కుష్టు బాధితులకు నల్లగొండలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోఉన్న కుష్టువ్యాధి విభాగంలో ఎండీటీ ప్రారంభించారు. అయితే కుష్టువ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించవచ్చనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2017 నుంచి ఎల్‌సీడీసీ సర్వే ద్వారా కుష్టు లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వ్యాధి నిర్ధారణ అయిన వారికి మల్టీడ్రగ్ థెరపీ చికిత్స అందిస్తూ వస్తోంది. దీంతో అప్పటి నుంచి జిల్లాలో కుష్టు కేసులు గణనీయంగా తగ్గిపోయాయి. రానున్న రోజుల్లో కుష్టువ్యాధి రహిత జిల్లాగా మార్చాలన్న సంకల్పంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ముందుకు సాగుతోంది.



ఇవీ.. కుష్టు లక్షణాలు

కుష్టు వ్యాధి అనేది మైక్రోబ్యాక్టీరియం లెప్రో అనే బ్యాక్టీరియా వల్ల కలిగే దీర్ఘకాలిక వ్యాధి. ఇది ప్రధానంగా ఏ వయసు వారికైనా సోకే అవకాశం ఉంటుంది. ఈ వ్యాధి.. నరాలు, చర్మం, ముక్కు ద్వారం ఎగువ శ్వాసనాళాలపై ప్రభావం చూపుతుంది. చర్మంపై ఎర్రని, గోధుమ రంగు (పాలిపోయిన, స్పర్శ లేకపోవడం వంటి మచ్చలు ఉంటే) కుష్టువ్యాధి లక్షణాలుగా గుర్తించాలి.

చికిత్స చేయించుకోవాలి



ఈ ఏడాది చేపట్టిన సర్వేలో కేవలం ఎనిమిది కేసులు నమోదు అయ్యాయి. లక్షణాలున్న వారు లెప్రసీ సెంటర్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స పొందాలి.
– డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్ఓ, నల్లగొండ

పెద్దగట్టు జాతరకు పటిష్ట ఏర్పాట్లు

- టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి


మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట): పెద్దగట్టు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర టూరిజం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లి శివారులోని శ్రీలింగమంతుల స్వామి దేవస్థానాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 16 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతరలో సౌకర్యాల కల్పనకు రూ.10 కోట్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరినట్లు తెలిపారు. ఈ నిధులతో శాశ్వతంగా ఉండేలా ఘాట్ రోడ్డు, భక్తులు నిద్రించడానికి హాల్, మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మిస్తామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ రామ్మూర్తియాదవ్, కౌన్సిలర్ షఫీఉల్లా, ముదిరెడ్డి రమణారెడ్డి, గట్టు శ్రీను, వల్దాస్ దేవేందర్, జ్యోతి కరుణాకర్, తండు శ్రీనివాస్ గౌడ్, ఫరూక్ పాల్గొన్నారు.

దోపిడీ లేని సమాజ స్థాపనే లక్ష్యం

నల్లగొండ టౌన్: పీడిత ప్రజలు, రైతులు, కార్మికవర్గ పక్షపాతిగా ఎన్నోఏళ్ల నుంచి పోరాడుతున్న సీపీఐది త్యాగాల చరిత్ర అని ఆ పార్టీ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న సందర్భంగా గురువారం నల్లగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. అసమానతలు, దోపిడీ లేని సమాజం స్థాపనే ధ్యేయంగా సీపీఐ పోరాడుతోందన్నారు. ఈ నెల 30న నల్లగొండలో జరగనున్న శత వసంతాల బహిరంగ మహాసభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.శ్రవణ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, బి.నర్సింహ, రమేష్, లెనిన్, ముత్యాలు, రమ, సుజాత, ప్రద్యుమ్నారెడ్డి, యూసుఫ్, జమీల్ పాల్గొన్నారు.


పార్టీ జెండాను ఎగురవేస్తున్న నెల్లికంటి సత్యం

పాలు.. అక్రమాలు

భువనగిరి మదర్ డెయిరీ సెంటర్‌లో అవకతవకలు

- ఆవుపాలను బర్రెపాలుగా రికార్డుల్లో నమోదు
- రూ.లక్షల్లో స్వాహా చేసిన ఉద్యోగులు
- చైర్మన్ తనిఖీల్లో గుట్టు రట్టు
- మేనేజర్‌తో సహా ఆరుగురి సస్పెండ్
- పూర్తిస్థాయి విచారణకు ఆదేశం

సాక్షి,యాదాద్రి : అక్రమాలు.. వివాదాలకు ఆలవాలంగా మారిన మదర్‌డెయిరీలో మరో అవినీతి బాగోతం బయటపడింది. గ్రామాల్లోని సెంటర్ల నుంచి వచ్చే ఆవుపాలను బర్రె పాలుగా రికార్డుల్లో చూపించి నెలకు రూ.లక్షల్లో కాజేసిన ఘటన భువనగిరిలోని మదర్ డెయిరీ చిల్లింగ్ సెంటర్‌లో వెలుగుచూసింది. అక్రమ సంపాదనను మేనేజర్ నుంచి డాక్ వర్కర్ వరకు పంచుకున్నారు. చిల్లింగ్ సెంటర్‌కు నాణ్యతలేని పాలు వస్తున్నాయన్న అనుమానంతో మదర్ డెయిరీ చైర్మన్ ఇటీవల ఆకస్మిక తనిఖీ చేయగా గుట్టు రట్టయ్యింది. అవినీతిలో మేనేజర్ సహా ఆరుగురు సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు తేలడంతో వారిని సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించారు. వీరిలో మేనేజర్, ఇద్దరు రూట్ సూపర్‌వైజర్లు, ప్రాసెసింగ్ సూపర్‌వైజర్, ల్యాబ్ అసిస్టెంట్, డాక్ వర్కర్ ఉన్నారు.


భువనగిరి మిల్క్ చిల్లింగ్ సెంటర్

లీటరుకు రూ.25 అదనంగా..

భువనగిరి మండలం ఏంబాయి గ్రామానికి చెందిన పాల సొసైటీ నుంచి భువనగిరి మిల్క్ చిల్లింగ్ సెంటర్‌కు రోజూ పాలు వస్తుంటాయి. ఇందులో ఆవుపాలు ఉండగా వాటిలో బర్రె పాలు కలిపారు. ఎక్కువ ధర రావడానికి ఫ్యాట్ పెంచి రాసుకున్నారు. ఆవు పాలు 3.6 ఫ్యాట్ వస్తుండగా, బర్రె పాలు 5.5 వస్తుంది. ఆవు, బర్రె పాలను కలిపి 6.5 ఫ్యాట్ వచ్చినట్లుగా రికార్డుల్లో నమోదు చేశారు. ఈ విధంగా ప్రతి లీటరుపై రూ.25 వరకు అదనంగా దండుకున్నారు. ఈ సొసైటీ నుంచి జూలై 31 వరకు ఆవు పాలు, బర్రె పాలు వేర్వేరుగా పోశారు. ఆగస్టు 1నుంచి పూర్తిగా బర్రె పాలు వస్తున్నట్లు, రోజూ 400 లీటర్ల పాలు వస్తున్నాయని రికార్డుల్లో రాశారు.

పాలసొసైటీ చైర్‌పర్సన్ భర్తే డాక్ వర్కర్

భువనగిరి మిల్క్ చిల్లింగ్ సెంటర్‌లో డాక్ వర్కర్ ఏంబాయి పాలసంఘం చైర్‌పర్సన్ భర్త కావడంతో అక్రమాలకు తెరలేపారు. సొసైటీనుంచి వచ్చిన ఆవు, బర్రెపాలను కలిపి ఒకే విధంగా బర్రె పాల ఫ్యాట్‌గా రికార్డు చేశారు. అక్రమ సంపాదనను చిల్లింగ్ సెంటర్ మేనేజర్ నుంచి ల్యాబ్ అసిస్టెంట్ (ఫ్యాట్ చూసే వ్యక్తి), సూపర్ వైజర్లు, ప్రాసెసింగ్ సూపర్‌వైజర్, సొసైటీ చైర్మన్ వరకు పంచుకున్నారు.

విచారణ జరుపుతున్నాం



భువనగిరి మిల్క్ చిల్లింగ్ సెంటర్‌లో జరిగిన అవినీతిలో మేనేజర్‌తో సహా ఆరుగురిని సస్పెండ్ చేశాం. ఆవుపాలను బర్రె పాలుగా రికార్డుల్లో రాసి లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డారు. వీరిపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నాం. ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఉన్నా వదిలేది లేదు. అక్రమంగా కాజేసిన సొమ్మును రికవరీ చేస్తాం. బాధ్యులపైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మోత్కూరు, చౌటుప్పల్ చిల్లింగ్ సెంటర్లలో అక్రమాలు చోటు చేసుకోగా.. మేనేజర్లతో సహా నలుగురిని సస్పెండ్ చేశాం.
–గుడిపాటి మధుసూదన్ రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్

నెలకు రూ.2 లక్షలకు పైనే..

బర్రె పాలలో ఉండే వెన్న శాతం ప్రకారం నెలకు రూ. 2 లక్షలకు పైగా డైయిరీ నుంచి అదనంగా చెల్లించారు. వెన్న శాతం ఎక్కువగా ఉండే లీటరు బర్రె పాలకు ఉదయం రూ.57 చెల్లిస్తారు. అంటే రోజూ 200 లీటర్ల చొప్పున నెలకు 6 వేల లీటర్ల పాలకు రూ. 3.42 లక్షలు కాజేశారు. రాత్రి పాలు లీటరు రూ.52 చొప్పున 6 వేల లీటర్లకు గాను ప్రతినెలా 3.12 లక్షలు పక్కదారి పట్టించారు. ఆవు పాలు ఉదయం లీటరుకు రూ.38 చొప్పున 6 వేల లీటర్లకు రూ.2.28 లక్షలు, రాత్రి రూ.36 చొప్పున 6 వేల లీటర్లకు రూ.2.16 లక్షలు చెల్లిస్తారు. ఈ లెక్కన ఉదయం పూట 6000 లీటర్ల పాలపై రూ.1.14 లక్షలు రాత్రిపూట పాలపై రూ. 96 వేలు ప్రతి నెలా కాజేశారు.

కొత్తరకం దందా..

మదర్ డెయిరీ ఆధ్వర్యంలో నడుస్తున్న చిల్లింగ్ కేంద్రాల్లో గతంలోనూ అక్రమాలు వెలుగుచూశాయి. భువనగిరితో పాటు మోత్కూరు, చౌటుప్పల్ సెంటర్లలో పాల కొలతలు, బిల్లుల చెల్లింపు, వెన్న శాతంలో అవినీతి జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. ఆయా ఘటనల్లో మేనేజర్ స్థాయినుంచి క్షేత్ర సిబ్బంది వరకు వేటు పడింది. కాగా తాజాగా భువనగిరి చిల్లింగ్ సెంటర్ సిబ్బంది అక్రమ సంపాదన కోసం ఈసారి కొత్త రకం రూట్ ఎంచుకున్నారు. ఆవు పాలను రికార్డుల్లో బర్రెపాలుగా నమోదు చేస్తూ అక్రమాలకు పాల్పడ్డారు. సంస్థ నష్టాల్లో కూరుకుపోతున్నా అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు.ఉన్నతస్థాయి అధికారుల నుంచి సిబ్బంది వరకు అవకాశాన్ని బట్టి ఎంత దొరికితే అంత దండుకుంటున్నారు.

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామానికి చెందిన గీత కార్మికుడు గడ్డం వెంకన్న (53) మంగళవారం సాయంత్రం గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి


సాక్షిత (ఫైల్)

రాజాపేట: ఇంట్లో ఆడుకుంటూ కట్టెల పొయ్యి వద్దకు వెళ్లి దానిని పట్టుకుని తీవ్రంగా గాయపడిన చిన్నారి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలం రేణికుంట గ్రామానికి చెందిన ఎర్ర పరమేష్, స్వప్న దంపతులకు ముగ్గురు కుమార్తెలు సంతానం. వీరి రెండో కుమార్తె సాక్షిత(3) ఈ నెల 20వ తేదీన ఇంట్లో ఆడుకుంటూ ఇంటి వెనుక ఉన్న కట్టెల పొయ్యి వద్దకు వెళ్లి దానిని పట్టుకుంది. దీంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం సాక్షితను తల్లిదండ్రులు భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందింది. మృతురాలి తండ్రి పరమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మైసయ్య తెలిపారు.

కారును ఢీకొని వ్యక్తి దుర్మరణం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ యాదయ్య

చింతపల్లి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి రోడ్డుపై ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండల పరిధిలోని వింజమూరు సమీపంలో గురువారం జరిగింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం తాటికోలు గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన తోటపల్లి రాములు(39) రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఫంక్షన్‌హాల్ నుంచి స్వగ్రామం గొల్లపల్లికి బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో చింతపల్లి మండలం వింజమూరు సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావమరిది వెలిజర్ల ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యం


స్పందన

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన యువతి అదృశ్యమైందని ఆమె తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన కర్నె నాగమణి కుమార్తె స్పందన పీజీ పూర్తిచేసి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 24వ తేదీ ఉదయం స్పందన తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఆమె ఇంట్లో కనిపించలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా స్పందన ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తల్లి కర్నె నాగమణి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.515 కోట్ల ధాన్యం అమ్ముకున్నారు!

సీఎంఆర్‌లో మిల్లర్ల అక్రమాలు

- దందాలో 8 మిల్లులకు భాగస్వామ్యం
- నాలుగు మిల్లుల నుంచి రు.420 కోట్ల ధాన్యం పక్కదారి పట్టించారు
- మరో నాలుగు మిల్లులకు చెందిన వారు రూ.95 కోట్ల ధాన్యం అమ్ముకున్నారు
- విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో వెల్లడైన నిజాలు



కోదాడ: కస్టమ్ మిల్లింగ్ కోసం పౌరసరఫరాలశాఖ మిల్లర్లకు ఇచ్చిన వందల కోట్ల రూపాయల ధాన్యాన్ని సూర్యాపేట జిల్లాలో 8 మంది మిల్లర్లు భారీ ఎత్తున పక్కదారి పట్టించారని, ఈ ధాన్యాన్ని బియ్యంగా మార్చి బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోవడమేగాక కాకినాడ పోర్టు ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి చేసినట్లు ఇటీవల పౌరసరఫరాలశాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ నిర్వహించిన తనిఖీలో వెల్లడైంది. సూర్యాపేట జిల్లాకు చెందిన ఈ నాలుగు మిల్లులు ఏకంగా రూ.420 కోట్ల విలువైన ధాన్యాన్ని పక్కదారి పట్టించగా మరో నాలుగు మిల్లులకు చెందిన వారు మరో రూ.95 కోట్ల విలువైన ధాన్యాన్ని పక్కదారి పట్టించారు. ఈ మిల్లర్లపై ఇప్పటికే పౌరసరఫరాలశాఖ కేసులు నమోదు చేయగా కొంత మంది హైకోర్టు వరకు వెళ్లి తమపై ఆర్.ఆర్ యాక్ట్ ప్రయోగించకుండా స్టే తెచ్చుకొని స్వేచ్ఛగా ఇతర మిల్లులను లీజుకు తీసుకొని తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారని సమాచారం.

నాలుగే మిల్లులు.. రూ.420 కోట్లు

సీఎంఆర్ ధాన్యం దందాలో సూర్యాపేట జిల్లాలోని 8 మిల్లులు భాగస్వాములుగా ఉననట్లు అధికారులు గుర్తించారు. తిరుమలగిరికి చెందిన శ్రీ సంతోషి రైస్ మిల్ రూ.120 కోట్ల ధాన్యం, కోదాడకు చెందిన శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండ్రస్ట్రీ ప్రై లిమిటెడ్ రూ.85 కోట్ల ధాన్యం, గరిడేపల్లి మండలం గడ్డిపల్లి సమీపంలోని శ్రీ సతోషిమాత రైస్‌మిల్ రూ.105 కోట్ల ధాన్యం, నేరేడుచర్లకు చెందిన తిరుమల రైస్‌మిల్ రూ.108 కోట్ల ధాన్యం పక్కదారి పట్టించినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఈ నాలుగు మిల్లులతో పాటు జిల్లాకే చెందిన హర్షిత రైస్ కార్పోరేషన్, ఎంకేఆర్ రైస్ మిల్, రఘురామ్ ఇండ్రస్ట్రీ, లక్ష్మీ ట్రేడర్స్ కలిపి మరో రూ.95 కోట్ల రూపాయల విలువైన సీఎంఆర్ ధాన్యాన్ని బియ్యంగా మార్చి బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నారు. 2022–23 వానాకాలం సీజన్‌కు సంబంధించి వీరు రూ.212 కోట్ల విలువ చేసే 56,184 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని, 2022–23 యాసంగి సీజన్‌కు సంబంధించి రూ.303 కోట్ల విలువ చేసే 83,911 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేసినట్లు విజిలెన్స్ అధికారులు ఆధారాలను సేకరించినట్లు సమాచారం.

ధాన్యం పక్కదారి పడుతున్నా పట్టించుకోలేదు

సీఎంఆర్ ధాన్యం మిల్లులకు కేటాయించిన తరువాత ఆ మిల్లులో ధాన్యం పక్కదారి పట్టకుండా మండల స్థాయి అధికారులు నిత్యం పర్యవేక్షించాల్సి ఉంటుంది. కేటాయించిన ధాన్యం.. మిల్లర్ తిరిగి ఇచ్చిన బియ్యం.. ఇంకా మిల్లర్ వద్ద మిగిలిన ధాన్యంతో రిజిస్టర్ మెయిన్‌టెన్ చేస్తూ వారానికి ఒకసారి ఉన్నతాధికారులకు రిపోర్టు ఇవ్వాలి. కానీ, దీనిని పట్టించుకోలేదని విజిలెన్స్ అధికారులు తమ రిపోర్టులో పేర్కొన్నారు. మిల్లులో ధాన్యం లేదని రిపోర్టు ఇస్తే తమ మెడకు చుట్టుకుంటుందని మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేకపోయినా ఉన్నట్లు చూపి ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించారని సమాచారం.

లక్షలు దండుకున్న అధికారులు

2022–23 వానాకాలం సీజన్‌కు సంబంధించి ఈ 8 మంది మిల్లుల యజమానులకు దాదాపు రూ.300 కోట్ల విలువైన ధాన్యం పౌరసరఫరాల శాఖ అధికారులు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద కేటాయించారు. కాని వారు గింజ బియ్యం కూడా తిరిగి ఇవ్వలేదు. వాస్తవానికి వీరికి 2022–23 యాసంగి సీజన్‌కు సీఎంఆర్ ధాన్యం కేటాయించకూడదు. కానీ ప్రజాప్రతినిధుల అండతో మళ్లీ వీరికి అధికారులు మరో రూ.250 కోట్ల విలువైన ధాన్యం కేటాయించారు. ఈ విషయంలో జిల్లా స్థాయి అధికారులకు మిల్లర్లు లక్షల రూపాయల నజరానాలుగా ఇచ్చినట్లు పలువురు మిల్లర్లే అంటున్నారు.

వృద్ధుడి కోరిక నెరవేర్చిన ప్రభుత్వ విప్


తలనీలాలు సమర్పించక ముందు పెంటయ్యతో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య


తలనీలాలు సమర్పించిన తర్వాత బీర్ల ఐలయ్యకు నమస్కరిస్తున్న పెంటయ్య

- యాదగిరిగుట్టలో తలనీలాలు తీయించి, స్వామి వారి దర్శన భాగ్యం కల్పించిన బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: హైదరాబాద్‌లో భిక్షాటన చేస్తూ 20 ఏళ్లుగా జట్టు, గడ్డం పెంచుకొని అంధవికారంగా తయారైన వృద్ధుడి కలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నెరవేర్చారు. పెంటయ్య అనే వృద్ధుడు హైదరాబాద్‌లో భిక్షాటన చేసుకుంటూ తిరుగుతుండేవాడు. అతడు 20 ఏళ్లుగా జుట్టు, గడ్డం పెంచుకుని అంధవికారంగా తయారయ్యాడు. హైదరాబాద్‌లోని మాతృదేవోభవ అనాథాశ్రమ నిర్వాహకుడు గిరి ఓ రోజు పెంటయ్యను చూసి అతడితో మాట్లాడగా.. తన తలనీలాలు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద తీయించాలని గిరిని పెంటయ్య కోరాడు. ఇదంతా గిరి వీడియో తీసి పెంటయ్య కోరిక తీర్చాలని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. సామాజిక మాధ్యమాల్లో ఈ వీడియో చూసిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గురువారం గిరి సహాయంతో ప్రత్యేక వాహనంలో పెంటయ్యను యాదగిరిగుట్ట క్షేత్రానికి తీసుకొచ్చి కల్యాణ కట్టలో పెంటయ్య తలనీలాలు తీయించి, లక్ష్మీనరసింహుడి దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా మాతృదేవోభవ అనాథాశ్రమ నిర్వాహకుడు గిరి మాట్లాడుతూ.. పెంటయ్యకు లక్ష్మీనరసింహుడి దర్శన భాగ్యం కల్పించిన విప్ బీర్ల ఐలయ్య, ఆలయ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్రిస్మస్ ప్రార్థనలు చేస్తుండగా అభ్యంతరం

- కేసు నమోదు చేసిన పోలీసులు

చౌటుప్పల్ రూరల్: క్రిస్మస్ పండుగ సందర్భంగా ఇంట్లో ప్రార్థన చేస్తుండగా.. కొంతమంది అయ్యప్ప భక్తులు వచ్చి అభ్యంతరం తెలిపి తమపై దాడి చేసేందుకు యత్నించారని గురువారం ఓ వ్యక్తి చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలం పాత్రుతండాకు చెందిన బాలాజీ నాయక్ తన భార్య లక్ష్మీకాంతంతో కలిసి చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామానికి కొన్నేళ్ల క్రితం వలస వచ్చి ఉంటున్నాడు. నేలపట్ల గ్రామ స్టేజీ వద్ద లక్ష్మీకాంతం మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇస్తోంది. బుధవారం క్రిస్మస్ పండగ సందర్భంగా కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చే ఇంట్లో సూర్యాపేట నుంచి వ్యవసాయ పనుల కోసం వలస వచ్చిన కూలీలతో పాటు నేలపట్ల గ్రామానికి చెందిన దళిత మహిళతో కలిసి ప్రార్థన చేస్తుండగా కొంతమంది అయ్యప్ప మాలధారులు వచ్చి అభ్యంతరం తెలిపారు. తమ గ్రామంలో క్రిస్టియన్లు ఎవరూ లేరని, అయినా మీరు ఇలా ప్రార్థనలు చేయించడం తగదని లక్ష్మీకాంతంతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ప్రార్థనలు చేస్తున్న ఇంటి గోడకు స్వస్తిక్, ఓం గుర్తులు రాశారు. తమపై దాడి చేయడానికి వచ్చి భయభ్రాంతులకు గురిచేశారని బాలాజీనాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి మాతృవియోగం


భాగ్యమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మేములపల్లి(మాడ్గులపల్లి), నల్లగొండ: మాడ్గులపల్లి మండలం చర్లగూడెం గ్రామానికి చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాతృమూర్తి అలుగుబెల్లి భాగ్యమ్మ(82) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు చర్లగూడెం గ్రామానికి చేరుకుని భాగ్యమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, రెమడాల పరుశురాములు, పాదూరి శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, రొండి శ్రీనివాస్, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ఉపాధ్యక్షుడు సీహెచ్. రాములు, కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, మాణిక్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

- ఆస్పత్రిలో తమ బంధువులను పరామర్శించి వస్తుండగా ఘటన


దుర్గారావు మృతదేహం


ఉపేందర్ మృతదేహం

హుజూర్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ టన హుజూర్‌నగర్ మండలంలో గురువారం రాత్రి జరిగింది. గరిడేపల్లి మండల కీతవారిగూడెం గ్రామానికి చెందిన నెమ్మరబోయిన దుర్గారావు(26), శీలం ఉపేందర్(24) హుజూర్‌నగర్‌లో ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ బంధువులను పరామర్శించి తిరిగి కీతవారిగూడెం వైపు బైక్‌పై వస్తుండగా గోపాలపురం లో హుజూర్‌నగర్–మిర్యాలగూడ రహదారిపై ఉన్న డివైడర్‌ను అదుపుతప్పి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇద్దరూ మృతిచెందారు. దుర్గారావుకు భార్య, 10 నెలల కుమార్తె ఉన్నారు. ఉపేందర్‌కు వివాహం కాలేదు.

కల్తీ కల్లు ఘటనపై పోలీసు, ఎక్సైజ్ అధికారుల ఆరా

- పెర్కకొండారంలో ఈత చెట్లను పరిశీలించిన అధికారులు

నకిరేకల్(శాలిగౌరారం): కల్తీ కల్లు తాగి బుధవారం ఆరుగురు వ్యక్తులు అస్వస్థతకు గురైన ఘటనపై నకిరేకల్ ఎక్సైజ్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ మేరకు గురువారం శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామ శివారులోని కుమ్మరికుంట వద్ద ఈత చెట్లను పరిశీలించి కల్లు శాంపిళ్లను సేకరించారు. అదేవిధంగా నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా కల్తీ కల్లు ఘటనలో విషమంగా మారిన ముగ్గురిలో ఒకరి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడగా మరో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్లు బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్


బ్యాగు అప్పగిస్తున్న ఆర్టీసీ అధికారులు

యాదగిరిగుట్ట: ఆర్టీసీ బస్సులో బ్యాగు పోగొట్టుకున్న మహిళా ప్రయాణికురాలికి బ్యాగును అప్పగించి ఓ కండక్టర్ తన నిజాయితీ చాటుకున్నాడు. యాదగిరిగుట్ట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో మహబూబాబాద్ జిల్లా కేసముద్రంకు చెందిన ఎస్. ఉపేంద్ర మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ నుంచి జూబ్లీ బస్‌స్టేషన్‌కు వెళ్లింది. ఈ సమయంలో తనతో తీసుకొచ్చిన బ్యాగును బస్సులోనే మరిచిపోయింది. ఆ బ్యాగును గుర్తించిన యాదగిరిగుట్ట డిపో కండక్టర్ సీహెచ్. రమేష్ డిపోలో అందజేశారు. ఆ బ్యాగులో రూ.1.50లక్షల నగదు, వెండి పట్టా గొలుసులు, ఆధార్, పాన్, రేషన్‌కార్డులు ఉన్నాయి. బ్యాగులో దొరికిన వివరాల ఆధారంగా బాధిత మహిళకు సమాచారం ఇచ్చి యాదగిరిగుట్ట డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ తదితరులు తిరిగి ఆమెకు అప్పగించారు. ఆర్టీసీ ఉద్యోగులకు, కండక్టర్‌కు ప్రయాణికురాలు ఎస్. ఉపేంద్ర కృతజ్ఞతలు తెలిపింది.

డెంగీతో విద్యార్థి మృతి


పవన్‌కుమార్ (ఫైల్)

నకిరేకల్(శాలిగౌరారం): డెంగీ జ్వరంతో ఆస్పత్రిలో చేరిన పదో తరగతి విద్యార్థి చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. శాలిగౌరారం మండలం మనిమద్దె గ్రామానికి చెందిన జనగం నాగరాజు, సైదమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు జనగం పవన్‌కుమార్(15) వల్లాల గ్రామంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. రెండు వారాల క్రితం అతడికి జ్వరం రావడంతో తల్లిదండ్రులు నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. జ్వరం తగ్గకపోవడంతో అక్కడ నుంచి నల్లగొండలోని మరో ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అయినప్పటికీ జ్వరం నయంకాకపోవడంతో నార్కట్‌పల్లిలోని కామినేని హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ పవన్‌కుమార్‌ను పరీక్షించిన వైద్యులు డెంగీ సోకినట్లు గుర్తించి హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. ఈ మేరకు పవన్‌కుమార్‌ను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు.

అప్పుల బాధతో బలవన్మరణం


నర్సయ్య (ఫైల్)

అడ్డగూడూరు: అప్పుల బాధతో గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం..అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన బీరవెల్లి నర్సయ్య(51) కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక 22వ తేదీ ఉదయం తన ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. అతడి భార్య సత్యవతి గమనించి గ్రామస్తుల సహాయంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి డివైడర్ ఎక్కిన కారు

చౌటుప్పల్ రూరల్: కారు అదుపుతప్పి డివైడర్ ఎక్కి ఆగిపోయింది. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామ స్టేజీ వద్ద గురువారం రాత్రి జరిగింది. ఖమ్మం జిల్లాకు చెందిన దుర్గాప్రసాద్ కారులో హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామ స్టేజీ వద్దకు రాగానే కారు అదుపుతప్పి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గల డివైడర్ ఎక్కి ఆగడంతో పెను ప్రమాదం తప్పింది. లేదంటే విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు ఢీకొనే అవకాశం ఉండేది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. దుర్గాప్రసాద్ కుమార్తె ఇటీవలే మృతిచెందడంతో ఆయన మానసికంగా ఇబ్బంది పడుతూ కారు డ్రైవింగ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

పశువుల కొట్టానికి నిప్పుపెట్టిన దుండగులు


దగ్ధమైన కొట్టాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తుంగతుర్తి: పశువుల కొట్టానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో దగ్ధమైంది. ఈ ఘటన తుంగతుర్తి మండలం కొత్తగూడెం గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం గ్రామానికి చెందిన వర్దెల్లి మంగయ్యకు గ్రామ సమీపంలోని తన వ్యవసాయ క్షేత్రంలో పశువుల కొట్టం ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు ఆ పశువుల కొట్టానికి బుధవారం రాత్రి నిప్పుపెట్టడంతో అందులోని ఎడ్లబండి, విద్యుత్ వైర్లు, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మిర్యాలగూడ: పట్టణ కేంద్రానికి చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు బేస్‌బాల్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు అమరావతి సైదులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో జగిత్యాల జిల్లా కేంద్రంలో మహిళల విభాగంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వెన్నెల, తేజశ్రీ, అదేవిధంగా 13, 14, 15 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన సీనియర్ పురుషుల విభాగంలో చిర్ర మల్లేష్, కొరుపోలు రవి ఉత్తమ ప్రతిభ చాటడంతో బేస్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సెలెక్షన్ కమిటీ వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని సంగూరులో నిర్వహిస్తున్న 37వ సీనియర్ బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్–2024 పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున వీరు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఒకరికి గాయాలు

- 108 వాహనంలో ఆస్పత్రికి తరలించిన హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు


క్షతగాత్రుడిని హాస్పిటల్‌కు తరలించేందుకు 108 వాహనానికి ఫోన్ చేస్తున్న సీఐ చరమందరాజు

మఠంపల్లి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గురువారం రాత్రి మఠంపల్లి మండల కేంద్రం సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలంలోని నాగార్జున సిమెంట్ పరిశ్రమ మెస్‌లో వంట కార్మికుడిగా పనిచేస్తున్న షేక్ హుస్సేన్ గురువారం రాత్రి బైక్‌పై హుజూర్‌నగర్ మండలంలోని తన స్వగ్రామమైన లింగగిరికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మఠంపల్లి సమీపంలోని ప్రధాన రహదారిపై గల రైల్వే వంతెన వద్ద హుజూర్‌నగర్ నుంచి నాగార్జున సిమెంట్ పరిశ్రమకు వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. హుస్సేన్ రోడ్డుపై పడిపోవడంతో అతడి కాళ్లు, చేతులు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న హుజూర్‌నగర్ సీఐ గజ్జె చరమందరాజు గమనించి 108 వాహనానికి ఫోన్ చేసి అందులో క్షతగాత్రుడిని హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వరి నాట్లు వేయడంలో మెళకువలు



నడిగూడెం : ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగర్ ఆయకట్టు ప్రాంతంతోపాటు, నీటి సౌకర్యం ఉన్న రైతులు వరి నాట్ల పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. యాసంగి సీజన్‌లో వరి నాట్లలో మెళకువలు, ఎరువుల యాజమాన్యంపై నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

15 రోజుల ముందే దమ్ము చేయాలి

నాట్లు వేయడానికి 15 రోజుల ముందే పొలాన్ని దమ్ము చేయడం ప్రారంభించాలి. 2 నుంచి 3 దఫాలుగా మురగ దమ్ము చేయాలి. పొలమంతా సమానంగా దమ్ము చెక్కతోగానీ, అడ్డతోగాని చదును చేయాలి. రేగడి భూముల్లో నాట్లు వేయడానికి 2 రోజుల ముందుగానే దమ్ము పూర్తి చేసి, ఆ తర్వాతనే నాట్లు వేస్తే మంచిది.

కాలి బాటలు తీయాలి

నారు తీసేటప్పుడు మొక్కలు లేత ఆకుపచ్చగా ఉంటేనే నాటు త్వరగా కుదురుకుంటుంది. నాలుగు నుంచి ఆరు ఆకులున్న నారును ఉపయోగించాలి. దీర్ఘ, మధ్యకాలిక నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని అనుసరించి ప్రస్తుత యాసంగి సీజన్‌లో చదరపు మీటరుకు 44 కుదుళ్లు ఉండేలా చూడాలి. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. కాలి బాటలు తీయాలి. దీంతో పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి, చీడ, పీడల ఉధృతి కొంతవరకు అదుపుచేయవచ్చు. ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు వేయడానికి ఇంకా పైరు పరిస్థితిని గమనించడానికి ఈ బాటలు బాగా ఉపయోగపడతాయి. వరి రకాల కాలపరిమితిని బట్టి కుదుళ్ల సంఖ్యను నిర్ధారించాలి. భూసారం ఎక్కువ ఉన్న పొలాల్లో తక్కువ కుదుళ్లు, భూసారం తక్కువగా ఉన్న పొలాల్లో ఎక్కువ కుదుళ్లు ఉండేటట్లు నాటాలి. ముదురు నారు నాటినప్పుడు కుదుళ్ల సంఖ్యను పెంచి, కుదురుకు 4–5 మొక్కల చొప్పున నాటు వేయాలి. ఇలా ముదురు నారు నాటినప్పుడు నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25 శాతం పెంచి మూడు దఫాలుగా కాక, రెండు దఫాలుగా అంటే 70 శాతం దమ్ములో, మిగతా 30 శాతం అంకురం దశలో వాడాలి.

ఎరువుల యాజమాన్యం

- నత్రజనిని కాంప్లెక్స్ ఎరువుల రూపంలో గానీ, యూరియా రూపంలోగానీ వాడవచ్చు.
- నత్రజని మూడు సమ భాగాలుగా చేసి, నాటుకు ముందు దమ్ములో, అంకురం దశలో, బురద పదునులో మాత్రమే సమానంగా వెదజల్లి 36–48 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలి.
- 50 కిలోల యూరియాకు 10 కిలోల వేపపిండి లేక 250 కిలోల తేమ కలిగిన మట్టి గానీ కలిపి 2 రోజులు నిల్వ ఉంచి వెదజల్లితే నత్రజని వినియోగం పెరుగుతుంది.
- మొత్తం భాస్వరం ఎరువును దమ్ములో వేయాలి.
- పొటాష్ ఎరువులను రేగడి నేలల్లో ఆఖరి దమ్ములో పూర్తిగా ఒకేసారి వేయాలి. చెల్క నేలల్లో ఆఖరి దమ్ములో సగం, అంకురం ఏర్పడే దశలో మిగతా మిగతా సగాన్ని వేయాలి.
- కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా దుబ్బుచేసే సమయంలోగాని, అంకురం ఏర్పడే దశలో గానీ వేయకూడదు. దమ్ములో వేయడం మంచిది.

జింకు సల్ఫేట్ వేయాలి

రైతు తన భూమిలో రెండు పంటలు వరి పండించేటట్లయితే ప్రతి యాసంగి సీజన్‌లో, ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్ వేయాలి. లేదా పైరుపై జింకులోపం కన్పించగానే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ చొప్పున 5 రోజుల వ్యవధిలో 2,3 సార్లు పిచికారీ చేయాలి.
గమనిక : భాస్వరం ఎరువుతో జింకు సల్ఫేట్‌ను కలిపి వేయకూడదు. కనీసం 3 రోజుల వ్యవధి ఉండాలి. కలిపి వేస్తే రసాయనిక చర్యవల్ల ఫలితం ఉండదు. జింకు సల్ఫేట్ ద్రావణంలో పురుగు, తెగుళ్ల మందులను కలుపరాదు.

జింకు లోప లక్షణాలు

జింకు లోపం వల్ల పైనుంచి 3 లేదా 4 ఆకుల్లో మధ్య ఈనె పాలిపోతుంది. నాటిన 2 నుంచి 4 లేదా 6 వారాల్లో ముదురాకు చివర్లలో, మధ్య ఈనెకు ఇరుపక్కల తుప్పు లేక ఇటుక రంగు మచ్చలు కనబడతాయి. ఆకులు చిన్నవిగా, పెళుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. మొక్కలు గిడసబారి దుబ్బు చేయవు. నత్రజని ఎరువులు దమ్ములో వేసినప్పటికి పైరు పచ్చబడదు.